www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025
5
తిరుపతి

కందారపు మురళీకి మాజీ ఎమ్మెల్సీల పరామర్శ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తల్లిని కోల్పోయి విషాదంలో ఉన్న సిపిఎం నేత, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కుటుంబ సభ్యులను శాసనమండలి మాజీ ఛైర్మన్ విఠపు బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌లు పరామర్శించారు. ఆదివారం యశోదా నగర్‌లోని వారి నివాసంలో కలిశారు.కందారపు రాజమ్మ నేత్రాలను దానం చేయడం అభినందనీయమన్నారు. బుధవారం కందారపు రాజమ్మ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్సీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందారపు మోహన్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాహుల్, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆదానీ కంపెనీ ప్రయోజనాల కోసమే స్మార్ట మీటర్లను బిగిస్తున్నారని, ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని నేడు వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్ పిలుపు నిచ్చారు. గత ఎన్నికల సమయంలో లోకేష్ స్మార్ట్ మీటర్లును పగలగొట్టండని పిలుపు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లపై అధికారంలోకి వచ్చిన తర్వాత నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ఈనెల 16 తేదీ నుండి ఆగస్టు 4 తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యతికిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె డిమాండ్ల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టిటిడిని నిత్యం వివాదాలకు కేంద్రంగా మారుస్తున్నారని, కేంద్రంలోని బిజెపి నాయకులు, మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం ఇందుకు మినహాయింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తిరుపతిని కేంద్రం చేసుకుని మత ఉద్రిక్తతలు పెంచటమే బిజెపి లక్ష్యమని, ఈ చర్యల పట్ల ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్యను దూరం చేయడానికే స్కూళ్ల విలీనం వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. జిల్లా అభివృద్ధికి టిటిడి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల్లో ప్రతినెల 1 తేదీ నుండి 15 తేదీవరకు సరుకులు పంపిణీ చేస్తామని చెప్పినప్పటికీ ఎక్కడా అమలు కాలేదన్నారు. జిల్లాలో గుర్తించిన సమస్యలపై నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రహ్మణ్యం, అంగేరి పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు పి.సాయి లక్ష్మి, ఆర్ లక్ష్మి,ఎస్. జయచంద్ర, కె వేణుగోపాల్, శివకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి

ఘనంగా బిఎన్ఐ కాంక్లీవ్ 2.0

- సూక్ష్మ వ్యాపారాల అభివృద్ధికి బిఎన్ఐ చక్కటి వేదిక : దివాకర్ రెడ్డి

డాలర్స్ దివాకర్ రెడ్డిని సత్కరించి, జ్ఞాపికను అందిస్తున్న బిఎన్ఐ ప్రతినిధులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), రామచంద్రాపురం: సూక్ష్మ, మధ్యతరహా, పారిశ్రామిక రంగాలు, వివిధ రంగాలకు సంబంధించి తమ వ్యాపారాలను ప్రాంతీయం నుండి జాతీయానికి, జాతీయం నుండి అంతర్జాతీయ స్థాయికి తీసుకొని వెళ్లడానికి బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) దోహదపడుతుందని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ కాంక్లీవ్ 2.0 కార్యక్రమాన్ని తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఆశ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో దేశంలోని 1000 నుంచి 1500 మంది వివిధ వ్యాపారాలకు సంబంధించిన నిర్వాహకులు ఒకే వేదికపై నుండి తమ వ్యాపార విస్తరణకు అనువైన ఆలోచనలను ఒకరికొకరు చేరవేసుకున్నారు. బిఎన్ఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ ద్వారా నూతన ఉత్పాదకతలు దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు. తమ వ్యాపార రంగాన్ని అభివృద్ధి చేసుకొని సమాజ సేవకు కూడా దోహదపడాలని దివాకర్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.

ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ బిఎన్ఐ ద్వారా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తూ వ్యాపార అభివృద్ధికి రెఫెరల్‌గా మరిన్ని ప్రణాళిక బద్ధమైన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎటువంటి స్వయార్జన లేకుండా కేవలం వ్యాపార అభివృద్ధికి బిఎన్ఐ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వచ్చిన వివిధ వ్యాపార సంస్థల నిర్వాహకులకు జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఐ తిరుపతి రీజియన్ ఛైర్మన్ మని సందీప్, కో ఛైర్మన్ టెంకాయల దుర్గాప్రసాద్, కన్వీనర్ యుగంధర్, స్పాన్సర్ కోఆర్డినేటర్ వంశీకృష్ణారెడ్డి, సాయికిరణ్, పార్థసారథి, స్వాతి బిఎన్ఐ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడికృత్తిక.. ఆలయాల్లో పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా ఆది వారం శ్రీకాళహస్తికి భక్తులు పోటెత్తారు. శ్రీకాళహస్తిలోని విజ్ఞానగిరిపై వెలసిన శ్రీకుమారస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీవల్లి, దేవసేన సమేతం గా కుమారస్వామి వారు మాఢవీదుల్లో ఊరేగారు. జిల్లా కార్యా లయ కమీషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలందించారు. జిల్లా ట్రైనింగ్ కమిషనర్ సావిత్రి, జిల్లా యువజన ఛైర్మన్ షేక్ అజారుద్దీన్, స్కౌట్స్ మాస్టర్లు సుబ్రహ్మణ్యం, మణికంఠ, విద్యాసాగర్, మహేంద్ర, గైడ్ కెప్టెన్ సరిత, పిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హరోం హర నామ స్మరణతో మారు మోగిన ఆలయం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల) తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, ఊట్లవారిపల్లి సమీపంలో ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆడికృతిక సందర్భంగా ఆలయ ఈ.ఓ ఎస్ యువరాణి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కావడి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి స్వామి ఆడికృతిక ప్రత్యేకత, స్వామి వారి విశిష్టత గురించి తెలియజేశారు.

ప్రణాళికా బద్ధంగా లక్ష్యం వైపు పయనించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తే విజయం తథ్యమని సీనియర్ ఐఏఎస్ అధికారి, కార్మిక అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గంధం చంద్రుడు తెలిపారు. ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్వర్క్ (ఐడీజేఎన్) తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన దళిత విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు.

దళిత విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

తిరుపతి కచ్చిపి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ దళిత విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఇవ్వడం అభినందనీయం అన్నారు. మరో ముఖ్య అతిథి రిటైర్డ్ ఎస్పి రాజ శికామణి మాట్లాడుతూ యువత సరైన మార్గంలో నడవాలంటే తల్లిదండ్రులు పాత్ర చాలా కీలకమన్నారు. ఐడిజెఎన్ అంతర్జాతీయ అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఐడిజెఎన్ ప్రపంచంలోనే ఆరు దేశాల్లో చురుగ్గా పనిచేస్తుందని తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న దళిత జర్నలిస్టులను అభినందించారు. తిరుపతి జిల్లాలోని 34 మండలాలకు చెందిన మండల టాపర్లుగా నిలిచిన దళిత విద్యార్థులకు నగదుతో కూడిన ప్రతిభ పుష్కారాలనుందించారు. ఈ కార్యక్రమంలో ఐడిజెఎన్ రాష్ట్ర అధ్యక్షులు టి. నానాజీ (నాని), రాయలసీమ ఆర్గనైజింగ్ సెక్రటరీ హరి ప్రకాష్, జిల్లా అధ్యక్షులు డి. కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, కోశాధికారి వినయ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు, దళిత జర్నలిస్టులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులకు లాజికల్ థింకింగ్ అవసరం

- సుప్రీమ్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సీనియర్ అడ్వకేట్ వికాస్ సింగ్

ప్రజాశక్తి - క్యాంపస్ : న్యాయ విద్యార్థులకు లాజికల్ థింకింగ్ అత్యవసరమని సుప్రీమ్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ / సీనియర్ అడ్వకేట్ వికాస్ సింగ్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం న్యాయ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ఆదివారం సావేరి సెమినార్ హాల్‌లో అతిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు ఉండవలసిన ముఖ్య లక్షణాలు అనగా కృషి, పట్టుదల, నిబద్ధత, ఆసక్తిగా చదవడం, లాజికల్ థింకింగ్, పనిచేయడానికి సంశిద్ధత కలిగి వుండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య ఉమ, విభాగాధిపతి సీతా కుమారి, సోసియల్ సైన్సస్ డీన్ ప్రొఫెసర్ వాణి, న్యాయ విభాగపు అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక న్యాయవాదులు, అంబేద్కర్ గ్లోబల్ లా కాలేజ్ అధ్యాపాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికాస్ సింగ్‌ను సన్మానిస్తున్న మహిళా వర్శిటీ అధికారులు

మిథున్ రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపులో భాగమే

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కూటమి ప్రభుత్వం సాధింపుల్లో భాగంగానే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేసిందని, మాజీ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి పట్టుగొమ్మలుగా ఉన్న నాయకులను కక్ష సాధింపులు భాగంగానే అరెస్ట్ చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ వెంట మిథున్ రెడ్డి ఉన్నాడన్న కారణంగానే, అక్రమ కేసులు బనాయించారన్నారు. ఆయన ఏ తప్పు చేయలేదు, కడిగిన ముత్యముల తిరిగి వస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు పాలన చేస్తుందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ ఏ విధంగా రాష్ట్రంలో ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నామన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ప్రజాశక్తి - కేవిబి పురం: మిథున్ రెడ్డి అరెస్ట్‌ను, కేవిబి పురం మండలం, వైసీపీ కార్యాలయం వద్ద ఆదివారం తిరుపతి జిల్లా వైస్సార్సీపీ ఉపాధ్యక్షులు తెరణి ధనంజేయులు రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవకు నిరంతరం కృషి చేసిన నాయకుడిపై అసత్య ఆరోపణలు మోపుతూ, అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేయడం చాలా బాధాకరమైన విషయమని ఆయన వ్యాఖ్యానించారు. కడిగిన ముత్యంలా ఎంపీ మిథున్ రెడ్డి బయటకు వస్తారని, అక్రమ కేసులతో జగన్మోహన్ రెడ్డి బలాన్ని, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల ధైర్యాన్ని పోగొట్టలేరని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు దారుణమని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శి రాకేష్ కిరణ్ ఆరోపించారు. రాజకీయమంటే ప్రజా సేవని, గతంలో రాజకీయం ఉన్నత స్థానంలో ఉంటే ఈ ప్రభుత్వం ఆదం:పాతాళానికి తీసుకెళ్లిందన్నారు. రాజకీయం చేస్తే భావితరాలకు ఆదర్శంగా ఉండాలని, యువత రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తి చూపేలా ఉండాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

తప్పులు చేసిన వారికి శిక్షలు తప్పవు

- నరసింహ యాదవ్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైసిపి హాయంలో ప్రజాధనాన్ని దోచుకుని అక్రమ పద్ధతిలో తప్పులు చేసిన ఎవ్వరూ శిక్షల నుండి తప్పించుకోలేరని, టీడీపీ ఏనాడు కక్ష సాధింపు చర్యలకు దిగదని తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది వైసిపి వారిని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపిన కార్యక్రమాలకు సంబంధించి సంబంధం లేని సెక్షన్లతో కేసులు పెట్టి ఇబ్బంది పెట్టింది వాస్తవం కాదాని ప్రశ్నించారు. త్వరలోనే తప్పులు చేసిన ఎంతటి వారినైనా కూడా కటకటాల వెనక్కు పంపడానికి కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ మాట్లాడుతూ కక్ష సాధింపుకు పాల్పడింది వైసీపీ అని, దిష్టి బొమ్మలు తగలబెడితే కూడా హత్యా నేరం సెక్షన్లు పెట్టి కేసులు పెట్టడం వాస్తవం కాదాని ప్రశ్నించారు. త్వరలోనే ఈ లిక్కర్ స్కామ్ కు సంబంధించి జగన్మోహన్ రెడ్డితో సహా ఎవరైతే భాగస్వామ్యులు అయ్యారో వారందరూ కూడా జైలుకెళ్లాక తప్పదు అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి నగర టిడిపి ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, శ్రీరాములు, రామారావు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్టుపై హర్షం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మద్యం కుంభకోణంలో ఎంపి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడంపై టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. దీంతో పుంగనూరు ఊపిరి తీసుకుందని అన్నారు. చంద్రబాబు అరెస్టు అంశాన్ని లోక్‌సభ లో ప్రస్తావించిన బిసి నాయకుడు, నాటి యువ ఎంపి రామ్మోహన్ నాయుడును అసభ్య పదజాలంతో దూషించిన మిథున్ రెడ్డి అహంకార ధోరణికి నొచ్చుకున్న కోట్లాది మంది బిసి ల హృదయాలు మిథున్ అరెస్టుతో సంతోషపడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణంలో దోచుకున్న డబ్బును గత ఎన్నికలలో విచ్చలవిడిగా ఖర్చు చేయడంలో మిథున్ రెడ్డి పాత్ర అత్యంత కీలకపాత్ర అని ఆరోపించారు. టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డా.జి.దశరధాచారి, గాలి చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా గుడి మాకు చాలు

- వద్దన్నా మారు గుడి నిర్మిస్తున్న ప్రకాశం జిల్లా శేషగిరి స్వామి
- కోర్టుకెళ్లినా తిరిగి నాయకుల అండతో విగ్రహ ప్రతిష్ఠ
- శేషగిరి వద్ద కొందరి ఫోటోలు, అనుమానాస్పద మందులు
- క్షుద్ర పూజలపై గ్రామస్తుల అనుమానం, నిరసన

ప్రజాశక్తి - తడ :తడ మండలం, కొండూరు గ్రామ సమీపంలో నేషనల్ హైవే మీద వున్న శ్రీ శ్రీ జగత్ చాముండేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని ప్రకాశం జిల్లాకు చెందిన శేషగిరి స్వామి అనే వ్యక్తి అక్రమంగా నిర్మిస్తుండటంతో గ్రామస్తులు గతంలో గొడవలు చేసి అధికారులకు తెలిపి కోర్టుకు వేసి కట్టడాలను ఆపించారు. స్థానిక నాయకులు, కొందరు అధికారుల అండదండలతో మరలా వచ్చి గుడి నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అమ్మ వారి విగ్రహం కూడా ప్రతిష్టించారని, ఈ గుడి మాకు వద్దు.. మా గ్రామ దేవత కోండూరు అమ్మ వారు గుడి మాకు చాలు అని స్పష్టం చేశారు. శేషగిరి స్వామి వచ్చినప్పటినుంచి గ్రామంలో పురుషులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా ఆయన వచ్చిన ఆరు నెలల్లో 17 మంది చనిపోయారని ఆయన క్షుద్ర పూజలు చేస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూరేలా ఆయన వద్ద చాలా మందివి పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, పోస్టు కార్డు సైజ్ ఫోటోలు లభించాయి. వీటితో పాటు ఏవో తెలియని హోమియో పతి లేబుల్ వున్న బాటిల్‌లో ద్రవం వుందని, అది ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. శేషగిరి స్వామి గ్రామస్తుల రాకను గమనించి ఉదయం పారిపోయాడన్నారు. అతనిని పట్టుకొని అసలు నిజాలు బయటకు తేవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శేషగిరి వద్ద దొరికిన ఫోటోలు, మందులు

అలాగే ఆయనకు సహకరించిన వారిని సైతం విచారించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తడ ఎస్సై కొండప్ప నాయుడు, సూళ్లూరుపేట ఎస్సై బ్రహ్మయ్య నాయుడు వచ్చి గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయమై పై అధికారులకు తెలిపి తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ప్రతిభావంతులై సమాజానికి ఉపయోగపడాలి

గ్రాడ్యుయేట్ల బాధ్యత సమాజానికి అవసరం : లక్ష్మీనారాయణన్, క్రియా విశ్వవిద్యాలయం సహ వ్యవస్థాపకుడు

ప్రజాశక్తి - ఏర్పేడు : ఏర్పేడు సమీపం, ఐఐటి తిరుపతి క్యాంపస్‌లో 7వ స్నాతకోత్సవ వేడుకను ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రియా విశ్వవిద్యాలయం సహ వ్యవస్థాపకుడు కాగ్నిజెంట్ అండ్ ఛాన్సలర్ లక్ష్మి నారాయణన్ పాల్గొన్నారు. జెఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఐఐటి తిరుపతి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ సజ్జన్ జిందాల్ అధ్యక్షత వహించారు. లక్ష్మీ నారాయణన్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ విభిన్నవంతులై విభిన్న దృక్పథాలపై శ్రద్ధ వహించి మీ బాధ్యత సమాజానికి ఉపయోగపడాలని, అవసరమైన వారికి చేయూతనివ్వాలని, సరైన పరిష్కారం కోసం మాట్లాడాలని, సొంతంగా శీర్షికలు వ్రాయడం నేర్చుకుని ఆ కథలకు హీరోలుగా ఉండాలని తెలిపారు. సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, ఇన్స్టిట్యూట్ సిబ్బంది కృషిని అభినందించారు. టెక్నాలజీ మరియు సైన్స్ రంగంలో భారత ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలపై విశ్లేషించారు. విక్షిత్ భారత్ - భారతదేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చే దార్శనికతకు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి చాలా సమగ్రమైన విధానం అవసరం అన్నారు.

వివిధ డిగ్రీలలో పట్టభద్రులు: ఈ ఏడాది 417 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. వీరలో 212 బీటెక్, 91 ఎంటెక్, 53 ఎం ఎస్ సి, 16 ఎంపీపీ,13 ఎం ఎస్ (పరిశోధన), 28 పీహెచ్డీ, 01 ఎంటెక్ అండ్ పీహెచ్డీ డ్యూయల్ డిగ్రీ, 01 ఎం ఎస్ (పరిశోధన) అండ్ పిహెచ్డి డ్యూయల్ డిగ్రీ, 01 డిప్లొమా, 01 సర్టిఫికేట్ ఆఫ్ ఫౌండేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో పట్టభద్రులయ్యారు.

ప్రత్యేక బహుమతులు ప్రధానం:18 మంది విద్యార్థులు పతకాలు మరియు బహుమతులను పొందారు. 2025 బి.టెక్ గ్రాడ్యుయేట్లందరిలో అత్యుత్తమ విద్యా పనితీరుకు అరవింద్ శ్రీనివాసన్ కు రాష్ట్రపతి బంగారు పతకం లభించింది. 2025 బి.టెక్ గ్రాడ్యుయేట్లందరిలో పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యకలాపాలలో అన్ని విధాలుగా రాణించినందుకు మేఘవర్షినికి గవర్నర్ బహుమతి లభించింది. యుజి, పిజి కార్యక్రమాలలో అగ్రస్థానంలో నిలిచిన వారికి బహుమతులు కూడా ప్రదానం చేశారు.

రాజయ్యకు రోజా పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధి, 20వ వార్డు, వినాయకపురం, ఎస్టీ కాలనీలో నివసించే వైఎస్సార్సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి.రాజయ్య ఆటోపై ఇటీవల దుండగులు దాడి చేసిన దారుణ ఘటనను మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రంగా ఖండించారు. ఆదివారం రాజయ్య ఇంటికి వెళ్లి, ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవనోపాధిగా నడుపుతున్న ఆటోను రాత్రికి రాత్రే దుండగులు నిప్పుపెట్టడం అమానుషమన్నారు. కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసువారిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్లు ఏకాంబరం, ఎస్టి సెల్ నాయకులు ఈ చిరంజీవి, వైఎస్సార్సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు మహిళలను ఇబ్బంది పెడితే కేసులు పెట్టకుండా ఊరుకోవాలాని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులను అడ్డుపెట్టుకొని టీడీపీ వారిపై అనేక అసత్య ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. తనకు ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, పంబలేరు బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. గూడూరులో రౌడీయిజాన్ని ప్రోత్సహించమని తెలిపారు. గూడూరును తిరుపతిలో కలిపిన పాపం వైసీపీ వాళ్లదేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, శీలం కిరణ్ కుమార్, వెంకటేశ్వర రాజు , చిన్నా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కుడుముల వెంకటనారాయణ దాతృత్వంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జే.వి.వి. ఉపాధ్యక్షులు చెంచునారాయణ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కుడుముల నారాయణ దాతృత్వం సంతోషకరమన్నారు. వారి మనుమరాలు జులైలో పుట్టినందున ఈ నెల దాతృత్వం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జే .వి.వి. ప్రతినిధులు చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమ రావు, సుమన్ రెడ్డి, రాదయ్య, శ్రీనివాసాచారి, అరుణ్ కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ మాతమ్మ కొలుపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, బట్టికండ్రికలో వైభవంగా నిర్వహించిన మాతమ్మ కొలుపు మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వహుకులు ఆమెకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట జడ్పిటిసి మెంబర్ సురేష్ రాజు, వైఎస్సార్సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గౌడ ప్రతిభా పురస్కారాలు

గౌడ కులస్తులు విద్యార్థులకు ప్రతిభా పురస్కరాల కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పదవతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచిన గౌడ విద్యార్థులకు, గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దిండుపాటి కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం, స్థానిక శివశక్తి కల్యాణ మండపంలో సుమారు 100 మంది విద్యార్థులకు సిల్వర్ మెడల్స్, మెమెంటోలు, బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు కేఇ ప్రభాకర్, మాజీ డిజీపి ఈడే అశోక్ కుమార్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు చలపాటి వెంకటేశ్వర్లు, జిల్లా గౌడ సంఘం మాజీ అధ్యక్షులు యార్లపల్లి గోపి గౌడ్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి శైలజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పై చదువులు చదివి ఉన్నతమైన స్థానాల్లోకి వెళ్లి, మంచి పేరు తీసుకురావాలని తెలియజేసారు. కార్యక్రమంలో మహిమలూరి శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులు అరగొండ నరసింహులు గౌడ్, మద్దిలేటి కృష్ణమూర్తి, కంభం లోకనాధం తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ క్రికెట్ లీగ్ సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్–2025 సన్నాహక సమావేశం కుమ్మరి వీధిలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశం ప్రగతి సేవా సంస్థ, అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, పలు జట్ల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించిన అంశాలు చర్చించారు. టోర్నమెంట్ నిర్వహణ తేదీలు 31–08–2025 నుండి 02–09–2025(3 రోజులు)వరకు. పాల్గొను జట్లు తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని తెలిపారు. టోర్నమెంటును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి పిడి కరీముల్లా, మురళి సింగ్, బాబర్, రఫీ, బాలాజీ రాజు, చెంచుకృష్ణ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల వాలీబాల్ టోర్నీ విజేత కొనేపల్లి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రెండు రోజులపాటు సాగిన బొజ్జల వాలీబాల్ టోర్నీ విజేతగా కోనేపల్లి జట్టు నిలిచింది. ఆదివారం విజేతలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ కప్పును, ప్రైజ్ మనీని అందజేశారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు సుధీర్ రెడ్డి మంచి ప్రయత్నం చేస్తున్నారని బృందమ్మ కొనియాడారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడంలో బొజ్జల కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం విజేతకు రూ. 20 వేలు, రన్నరప్ కు రూ. 15 వేలు, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లకు చెరో రూ.5 వేలు చొప్పున ప్రైజ్ మనీ అందించారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నడకతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందుకోవచ్చని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ తెలిపారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె ఎల్ మూర్తి ఆధ్వర్యంలో వాకర్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య సమస్యలను తన దృష్టి తేవాలని సూచించారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరముల నుండి వెంకటగిరిలోనే తిష్ఠ వేసి ఉన్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం నాటికి 32వ రోజుకి చేరాయి. అలాగే సిఐటియు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె ఏడవ రోజుకి చేరింది. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచే వరకు పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, ప్రసాద్ సుబ్రహ్మణ్యం సుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

గూడూరులో..

8వ రోజూ కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతి జిల్లా, గూడూరులో రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఎ.పి. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు, తమ సమస్యల పరిష్కారం కొరకు సమ్మె లోనికి వెళ్లి ఆదివారానికి 8వ రోజుకు చేరుకుంది. అదే బాటలో పారిశుధ్య కార్మికుల సమ్మె బాట పట్టి 5 వ రోజుకు చేరుకుంది. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జి.ఓ.నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, 17 రోజులు సమ్మె కాలపు ఒప్పందాలకు జి.ఓ.లు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం జిల్లా కార్యదర్శి దారా కోటేశ్వర రావు, మున్సిపల్ సంఘం అధ్యక్షులు భూలోకం రమేష్, గూడూరు సిఐటియు ప్రధాన కార్యదర్శి రమణయ్య, భూలోకం మురళి, వెంకటరమణయ్య, పోలయ్య, పద్మమ్మ, వరలక్ష్మి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తాం

ప్రజాశక్తి - నాయుడుపేట: ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని నాన్ ఆఫ్కాస్ వారిని ఆప్కాస్ లోకి ఎక్కించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు కలిసి సంయుక్తంగా చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడ రేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డి పల్లి చెంగ య్య, ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డుతూ, ఇంజనీరింగ్ కార్మి కులకు జీతాలు పెంచాలని డి మాండ్ చేశారు. సమ్మె కాలపు ఒప్పం దాలకు జీవోలు వెంటనే ఇవ్వాలని అన్నారు. గత ఎనిమిది రోజుల నుండి సిఐటియు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మి కులు సమ్మెలో ఉన్నారని, అలాగే గత ఐదు రోజుల నుండి పారిశుధ్య కార్మికులు సమ్మె లో ఉన్నారని తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగు తుందని హెచ్చరించారు. సిఐటియు కార్యదర్శి శివ కవి ముకుంద మాట్లాడుతూ కార్మికులు ముందుగా నాయకులను, అధికారులకు వినతి పత్రా లు ఇచ్చారని, వారు స్పందించనందున సమ్మెలోకి వెళ్లడం జరిగిందని తెలిపారు. ఆవాజ్ సంఘం నాయకులు హలీమ్ కాల్ దీక్ష శిబిరంలో కూర్చుని మద్దతు తెలియజేశారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, రామ్మూర్తి, సుబ్బారావు, రాధాకృష్ణ తదితర యూటీఎఫ్ నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శంకర్ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, రామచంద్రయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- వ్యక్తిగత అరెస్టులతో విచక్షణ లోపించిన పాలన

వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలో పరిపాలన, విద్య సంబంధమైన సమస్యలను గాడిలో పెట్టి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను డబుల్ ఇంజిన్ అభివృద్ధి సాధిస్తానని గొప్పలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత అరెస్టులతో పరిపాలనలో విచక్షణ లోపించిందని వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ విమర్శించారు. ఈ సందర్భంగా వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్ మాట్లాడుతూ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. కనీసం జిల్లా స్థాయిలో నాయకత్వాన్ని బలపర్చుకోవడం చేతగాని నారా లోకేష్ బాబు గతంలో మూడోసారి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన సందర్భంగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పైన అనాలోచితంగా ఎయిర్పోర్టు సంఘటనలో కేసు నమోదు చేయించి జైలు పాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుతం మద్యం కేసు బూచి అడ్డుపెట్టుకొని జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకోవడానికి అవసరమైన శక్తి లేక జిల్లాలో అత్యంత ప్రజాదరణ ఉన్నటువంటి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక అక్రమ నిర్బంధం చేసి మరోసారి తప్పు చేశాడని అన్నారు. 2014లో అన్యాయంగా మిథున్ రెడ్డిని అక్రమంగా కేసు పెట్టి జైల్లో పెట్టించిన తర్వాత 2019లో వైఎస్ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే లోకేష్ బాబుని ఎలాంటి పరిస్థితిలో కూడా జైలు పాలు చేసేటువంటి ఆలోచన పెద్దిరెడ్డి కుటుంబం చేయలేదని చెప్పారు. కానీ నారా లోకేష్ బాబు మరో మారు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అక్రమంగా మద్యం కేసులో అరెస్టు చేయించి తన కుట్రపూరిత రాజకీయ దురుద్దేశాన్ని ప్రజలకు అర్థమయ్యేలాగా తెలిపారని వివరించారు. ఈ సంఘటనను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు మరచిపోలేరని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించాలి తప్ప కేవలం వైఎస్ఆర్సిపి నాయకులను ప్రత్యర్థులుగా చేస్తూ కక్షగట్టి మరీ జైలుకు పంపిస్తుండడం దారుణంగా ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో కేసులు న్యాయబద్ధంగా విచారణ జరగాలంటే కేంద్ర సంస్థల ఆధ్వర్యంలో జరిగితేనే నిష్పక్షపాతంగా విచారణ జరుగుతుందని అన్నారు. దీనికి తగిన మూల్యం నారా లోకేష్ బాబు భవిష్యత్తులో చెల్లించుకోక తప్పదంటే తప్పదని హెచ్చరించారు. దీని ప్రతిఫలం నారా లోకేష్ బాబు ముందు ఏడు తరాలు తర్వాత ఏడు తరాలు గుర్తుంచుకునేలాగా ఉంటదన్న విషయం పత్రికా ముఖంగా తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యారంగంలో ఆగస్టు నెల వస్తున్న ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ వంటి కళాశాలలో అడ్మిషన్లు ఇప్పటివరకు పూర్తి చేయలేదని, లా సెట్, ఐసెట్, ఎడ్ సెట్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో కూడా అడ్మిషన్లు ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా మండలి అన్ని రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష లను నిర్వహిస్తూ, తర్జనభర్జన పడుతూ మానవ వనరుల కొరతతో ఏ ఒక్క ఉమ్మడి ప్రవేశ పరీక్షను కూడా సకాలంలో అడ్మిషన్లు ఇవ్వలేక రాష్ట్రంలోని నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత కక్షలు మాని విద్యా వ్యవస్థ పై నిబద్ధతతో పనిచేసి సుపరిపాలన అందించాలని సూచించారు.

జనార్దన్ చౌదరికి ఘన సన్మానం



ప్రజాశక్తి - రామచంద్రపురం: రామచంద్రాపురం మండల పిఎసిఎస్ నూతన చైర్మన్‌గా నియమితులైన చేకూరి జనార్దన్ చౌదరికి పివిపురం మండల టిడిపి నాయకులు ఆదివారం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ చౌదరి మాట్లాడుతూ సింగల్ విండో ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలు మంజూరు చేసి రైతుల వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, రాజేష్, కుప్పా త్యాగరాజులు, దిలీప్ రాయల్, మల్లిరెడ్డి, భూపతి రెడ్డి, ప్రతాప్ రాయల్, నాగూర్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డయాలసిస్ సౌకర్యం కల్పించండి

వెందోటి పార్థసారథి రెడ్డి

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటకు చుట్టుపక్కల మండలాల్లో ఉన్న సుమారు 700 పైగా డయాలసిస్ పేషెంట్లు దూరప్రాంతాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆ అవసరం లేకుండా నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ (రక్త మార్పిడి)సౌకర్యం కల్పించాలని వైద్య ఆరోగ్య మరియు కుటుంబ శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్‌కు లేఖ రాసినట్లు నాయుడుపేట మాజీ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లాయర్ వెందోటి పార్థసారథి రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన ఈ లేఖకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో లక్ష మందికి పైగా జనాభా ఉన్నారని వీరే కాకుండా చుట్టుపక్కల కంపెనీలలో పని చేసేందుకు చుట్టుపక్కల పల్లె నుంచి సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు 40 వేలకు పైగా ఉన్నారని వీరందరి సౌకర్యార్థం ఈ మధ్యనే నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరిచారని కానీ అందులో డయాలసిస్ సంబంధించిన విభాగం లేకపోవడంతో వ్యాధిగ్రస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. నాయుడుపేట చుట్టుపక్కల మండలాలైన ఓజిలి, చిట్టమూరు, దొరవారిసత్రం, పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ మండలాల నుంచి నెల్లూరు, తిరుపతి, చెన్నైలకు వెళ్లాలంటే వంద కిలోమీటర్లలకు పైగా వెళ్ళవలసిన పరిస్థితి ఉందని పేదవాళ్లకు దీని భరించే స్తోమత లేక చెప్పరా అని అగసాట్లు పడుతున్నారని ఒక్కో మండలంలో సగటున 30 నుంచి 60 మంది వరకు బాధితులు ఉన్నారని నాయుడుపేట వీటన్నిటికీ కేంద్ర ప్రాంతమని ప్రజల సమస్యలను రోగుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని వారిపై దయతో నాయుడుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు ఈ సౌకర్యాన్ని కల్పించాలని కోరినట్లు తెలియజేశారు.

శ్వాస సంబంధిత వైరస్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్వాస సంబంధిత సింకిటియల్ వైరస్ (ఆర్ఎస్వి) పై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఎపి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ వసంత్ ఎం.ఖలాత్కర్ తెలిపారు. ఈ వైరస్ ఐదేళ్లలోపు పిల్లల్లో, శిశువుల్లో దిగువ శ్వాసనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లకు దారి తీస్తోందన్నారు. సంబంధిత టీకీలపై అవగాహన చాలా అవసరమని తెలిపారు. చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రత పాటించాలని సూచించారు. దీర్ఘకాలిక మోనోక్లోనల్ యాంటీబాడీలు అందుబాటులో ఉన్నాయని చిన్నారుల రక్షణకు ఇవి దోహదపడతాయని తెలిపారు. ఇప్పటికే పలివిజుమాబ్ అనే మందు హై–రిస్క్ శిశువులకు అందుతోందన్నారు. 2025 ఏప్రిల్‌లో, సానోఫీ, డాక్టర్ రెడ్డీస్ కలిసి శిశువులను ఆర్ఎస్వి సంబంధిత సమస్యల నుంచి రక్షించేందుకు రూపొందించిన, ఒక కొత్త డోసుతో ఇవ్వగల టీకాను భారత్‌కు తీసుకురావడానికి తమ భాగస్వామ్యాన్ని విస్తరిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ విషయంలో మరిన్ని వివరాల కోసం తమ పీడియాట్రిషన్, నెయోనటాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు 19 వ వార్డులో, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, కృష్ణ కుమార్‌ల ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కూటమి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టడీపీ అధ్యక్షులు, 19 వ వార్డు ప్రధాన కార్యదర్శి, 71వ బూత్ కన్వీనర్ చెంచయ్య, నాయకులు పెంచలయ్య, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు. 7వ వార్డులోని 53, 54వ బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, గత ఏడాది కాలంలో పార్టీ ద్వారా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత.. పాఠశాల అభివృద్ధి బాట

ప్రజాశక్తి - రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో, నూతన విధానం అమలులో భాగంగా మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం, అనుపల్లి గ్రామంలో మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసింది. ఆ పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు, యువత నడుం బిగించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. గతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలగా 9 మంది పిల్లలతో పాఠశాల నడిచేది. ఆ పాంశాల ఆవరణంలో రెండు తరగతి గదులు ఉండేవి. అవి కళాహీనంగా, తలుపులు పగిలిపోయాయి. పంచాయతీలో అన్ని గ్రామాలకి అనువుగా అనుపల్లిలో మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంవత్సరం నుండి ఏర్పాటు చేశారు. పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, లైట్లు, ఫ్యాన్లు లేవన్న విషయాన్ని పూర్వపు విద్యార్థులు, గ్రామాలలోని యువత గ్రహించి ఆ పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. రెండు తరగతి గదులకు పెయింటింగ్, మరుగుదొడ్లకు డోర్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. తాగునీటి బోరును మరమ్మతు చేయించారు. కరపత్రాలను తయారు చేసి, ఇంటింట ప్రచారంచేసి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 82 మంది విద్యార్థులు, 5 మంది ఉపాధ్యాయులతో కళకళలాడుతోంది. మండలంలోనే అనుపల్లి మోడల్ స్కూల్‌లో ఎక్కువమంది విద్యార్థులు ఉన్నారనేది విద్యాశాఖ లెక్కలు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకానికి నూతనంగా ఇద్దరు వర్కర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందేట్లు యువత, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.కె విఎన్ కుమార్ ఆదేశాలతో పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు డెస్కులు ఏర్పాటు చేశారు. జూలై 10 వ తారీఖున మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం, గురు పౌర్ణమి వేడుకలను పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. మోడల్ పాఠశాలలో విద్యార్థులకు మరో 2తరగతి గదులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇలాంటి తరుణంలో శనివారం మధ్యాహ్నం సిఆర్సి మీటింగ్ ఉన్నందున పాఠశాల విద్యార్థులు భోజనం అనంతరం ఆటోలో స్వగృహానికి వెళ్లేందుకు పాఠశాల ఆవరణలోని చెట్టు కింద కూర్చొని ఉంటే ఓ దినపత్రికకి చెందిన వ్యక్తి ఫోటోలు తీసి చెట్టు కింద చదువులు అనే తప్పుడు వార్త రాసి విద్యార్థులు, తల్లిదండ్రుల మనోభావాలు దెబ్బతినేలా చేయడంతో తల్లిదండ్రులు, పూర్వపు విద్యార్థులు, యువత ఆ దినపత్రిక యాజమాన్యాన్ని స్వయంగా పాఠశాలకు వచ్చి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. చాలా చక్కగా నిర్వహింపబడుతున్న మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూలుపై అసత్యాలు రాయడం మానుకొని పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

క్రైం న్యూస్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన ఆదివారం శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్‌లో చోటుచేసుకుంది. చంద్రయ్య, శ్రావణి దంపతులు గత కొంతకాలంగా రాజీవ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి తొమ్మిదేళ్ల కిందట వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. చంద్రయ్య తిరుమలలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. శ్రావణి(32) కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన జుట్టుకు వేసుకునే రంగు(వాస్మాల్–33) తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆదివారం తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందింది. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అలిగిందని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భార్య అలిగిందని భర్త ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటన శనివారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలోని కుందేటివారి వీధిలో చోటుచేసుకుంది. స్థానిక కుందేటివారి వీధిలో ఉంటున్న చిన్నప్పరెడ్డి(64) బీడీ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తరచూ మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తుండడంతో శనివారం రాత్రి భార్య మందలించింది. పక్క వీధిలో ఉన్న కొడుకు ఇంటికి అలిగి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన చిన్నప్పరెడ్డి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - నాయుడుపేట: ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాయుడుపేటలో ఆదివారం చోటుచేసుకుంది. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధి, తుమ్మూరు రామాలయం వెనక చెట్టుకి ఉరి వేసుకుని గుర్తుతెలియని (సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు) వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ఘటనస్థలికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. మృతుడి వివరాలు తెలిసినవారు సమాచారం అందించాలని కోరారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన.

పారిశుధ్య వాహనాలకు మరమ్మతులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రజాశక్తి దినపత్రికలో 'వాహనం కదలదు.. చెత్త వదలదు' అని ప్రచురితమైన కథనానికి మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. మూల పడ్డ వాహనాలకు, మెకానిక్‌లను పిలిపించి మరమ్మత్తులు చేయించారు. 2బ్యాటరీ వాహనాలను పట్టణాల్లో ఉన్న చెత్త సేకరణ కోసం పంపించారు. మిగిలిన వాహనాలను కూడా మరమ్మత్తు చేసి పట్టణంలో పారిశుధ్యానికి ఎలాంటి లోపం లేకుండా ఏర్పాటు చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

తూపిలి చెరువుకు జలాలు విడుదల

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా, వాకాడు మండలం, స్వర్ణముఖి బ్యారేజ్‌లో నిల్వ ఉన్న 50 క్యూసిక్కుల నీటిని వ్యవసాయార్థం దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ దిగువ ప్రాంతాలకు నీరు వదలడం వలన 20 గ్రామాలకు తాగునీరు, వ్యవసాయానికి నీటికి కొరత ఉండదన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దశరథరామిరెడ్డి, కోట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి, నీటి సంఘ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, వాకాడు టిడిపి ఉపాధ్యక్షులు దోసకాయల కృష్ణమూర్తి, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ నగర కార్యదర్శిగా జల్లా విశ్వనాథ్

సహాయ కార్యదర్శిగా బండి చలపతి ఏకగ్రీవంగా ఎన్నిక

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి నగర సిపిఐ కార్యదర్శిగా జల్లా విశ్వనాథ్, సహాయ కార్యదర్శిగా బండి చలపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఐ తిరుపతి నగర మహాసభలు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. 61 మందితో నూతన కౌన్సిల్ ఏర్పాటు అయింది. కౌన్సిల్ నుండి 13 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రెండు రోజులు జరిగిన మహాసభల్లో అనేక రకాల అంశాలపై తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బడి బంధం.. మరపురాని అనుబంధం

ప్రజాశక్తి - రామచంద్రాపురం : దుర్గ సముద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి 1983– 84 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గత స్మృతులు నెమరేసుకున్నారు. 40 సంవత్సరములు ముందు కలిసి చదివుకున్న విద్యార్థులు ఆదివారం తిరుపతి ఎయిర్ బైపాస్ రామానుజ సర్కిల్ దగ్గర ఉన్న నందిని హోటల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పటి హెడ్మాస్టర్ మునిరెడ్డికి, గురువులకు పాదపూజ చేసి, ఘనంగా సన్మానించారు. దుర్గ సముద్రం ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిద్దామని తీర్మానించుకున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి -ఏర్పేడు : కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారి విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిలోని నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఏడుగురు విద్యార్థులు ఎస్. అచ్యుత్ (తిరుపతి), కే.సరయు (తిరుపతి), కె చార్మి (తిరుచానూరు), ఆర్. లోకేశ్వరి (ఎల్లంపల్లి), ఎన్. హాసిని (ఎల్లంపల్లి), కె. ప్రణతి (కనపర్తి), భవాని (పాపన పల్లి) ఎంపిక చేసి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరం శ్రీరాములు(రిటైర్డ్ ఎస్బిఐ), గూడూరు వెంకటేశ్వర్లు, బండారుపల్లి దేవరాజులు, డా. గానుగ పెంట రమేష్, పులికొండ బాలకృష్ణ, ఎల్లంపల్లి సుబ్రమణ్యం, నరేష్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S.NO:22/2019

Between:
లింగం కృష్ణవేణి, రాయదుర్గం ...వాది
V/s
1.ఎమ్. పరంజ్యోతి
2.ఎమ్ రేవంత్ రెడ్డి
3.ఎం.వి.స్నేహితారెడ్డి ...ప్రతివాదులు
To,
D1: ఎం పరంజ్యోతి W/o లేట్ ఎం.వి. నరసింహరెడ్డి, తిరుపతి
D3: ఎం.వి.స్నేహితారెడ్డి D/o లేట్ ఎం.వి. నరసింహరెడ్డి 19–3–13 బి.కెన్నడి నగర్, తిరుపతి, చిత్తూరు జిల్లా ఆం.ప్ర
సమన్లు
వాది ప్రామిసరి నోటు బాపత్తు వసూలు నిమిత్తం మీ పై దావా దాఖలు చేయడమైనది. కావున మీరు పై కోర్టులో తేది 29.07.2025న ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని హజరై అన్సరు దాఖలు చేసుకోవాలి అట్లు మీరు హజరు కాని యెడల పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(By order of the court)
జి.లోకానంద,
ఎస్.జాన్సన్,
వాదితరుపు న్యాయవాదులు,
రాయదుర్గం, అనంతపురం జిల్లా.